సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం, 10, మే, 2024



భారీగా చేరికలు

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు జరిగాయి. నాయకులు వారిని సాదరంగా ఆహ్వానించారు. - 8లో



పాయింట్ల పేరిట మోసం

ఎస్‌బీఐ రివార్డు పాయింట్ల పేరిట మోసం జరిగింది. ఓ వ్యక్తి రూ.4లక్షలకుపైగా మోసపోయాడు. - 8లో

మిగిలింది రెండు రోజులే

హిరమండలం: సార్వత్రిక ఎన్నికల సమరం ఆఖరి అంకానికి చేరుతోంది. ఈనెల 13న పోలింగ్ జరగనుండగా శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రచారానికి తెర పడనుంది. ఇంకా రెండు రోజులే ఉండడంతో బరిలో ఉన్న అభ్యర్థులు క్షణం తీరిక లేకుండా నియోజక వర్గాలను చుట్టి వస్తున్నారు. నియోజక వర్గాల్లో తమ పరిస్థితి ఎలా ఉందోనని రహస్య సర్వేలు చేయించుకుంటున్నారు. ప్రైవేటు ఏజెన్సీల ద్వారా ఫోన్‌కాల్స్ చేయిస్తూ వారి అభిప్రాయాలు సేకరిస్తున్నారు.


న్యూస్‌రీల్

12, 13 తేదీల్లో మద్యం బంద్



శ్రీకాకుళం క్రైమ్ : ఈ నెల 13న ఎన్నికలు జరగనున్న దృష్ట్యా 12, 13 తేదీల్లో మద్యం అమ్మకాలు బంద్ చేస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) బి.సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలు (జీఆర్వోలు), బార్లు, కల్లు దుకాణాలు, మిలటరీ క్యాంటీన్లు, రణస్థలంలో ఉన్న బీర్ల తయారీ ఫ్యాక్టరీలకు శనివారం సాయంత్రం ఆరు గంటల కల్లా సీలు వేస్తామని పేర్కొన్నారు. మద్యం మత్తులో ఓటుహక్కు దుర్వినియోగం కాకూడదనే ఉద్దేశంతోనే కలెక్టర్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారని ఈఎస్ పేర్కొన్నారు.

ఓటేయడం నైతిక బాధ్యత : కలెక్టర్



ఓటు వేసేందుకు ఏర్పాటు చేసిన వసతుల లోగో

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటు వేయడం మన నైతిక బాధ్యత అని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. పోలింగ్ శాతం పెంచడమే ధ్యేయంగా అక్కడ మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఆయన గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఉక్కపోత అనే చిన్న చిన్న కారణాలతో చాలా మంది ఓటు వేసేందుకు దూరంగా ఉంటున్నారని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో మండుటెండలకు ఓటర్లు ఇబ్బందులు పడకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ మే 13న ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందని, ఆ సమయంలో ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

వేసవిలో ఇబ్బందులు లేకుండా..

జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో 2358 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 18,92,382 మంది ఓటర్లు ఆయా పోలింగ్ కేంద్రాల్లో మే 13న పోలింగ్‌లో పాల్గొననున్నారు. వేసవి నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, చల్లటి నీరు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఒక ఏఎన్ఎం, ప్రతి పది పోలింగ్ స్టేషన్లకి ఒక వైద్యాధికారి, అన్ని పీఎస్‌ల్లోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నామని కలెక్టర్ తెలిపారు. దివ్యాంగులకు వీల్ చైర్లు, వృద్ధులు, వికలాంగులు సులువుగా కేంద్రంలోకి వెళ్లేందుకు ర్యాంపులు ఏర్పాటు చేశారు. విధుల్లో ఉన్న సిబ్బంది ఇబ్బందులు పడకుండా మరుగుదొడ్లు, నీటి సౌకర్యం, భోజన వసతి కల్పించేందుకు ఉన్నతాధికారులు పోలింగ్ కేంద్రాల వారీగా నిధులు మంజూరు చేశారు. ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని, ప్రతి ఒక్కరు పోలింగ్ కేంద్రానికి వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యవంతులు కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

'లోటుపాట్లు లేకుండా ఎన్నికల విధులు'




జిల్లా ఎన్నికల అధికారి డా.మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికల విధులు సజావుగా నిర్వహించాలని, ఎన్నికల నిర్వహణలో పీఓలు, ఏపీఓల కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ అన్నారు. ఆయన గురువారం ఉదయం తన చాంబర్ నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నియోజకవర్గంలో చేపడుతున్న పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో ఎన్నికల విధులు సజావుగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులపై ఉందన్నారు. ఈవీఎంలో ఒక ఓటు పడిన తర్వాత ఏదైనా సమస్య తలెత్తితే రెండో ఈవీఎంను వినియోగించాలని పోలింగ్ పూర్తయిన తర్వాత మొదటి ఈవీఎంతో పాటు రెండో ఈవీఎంను కూడా రిసెప్షన్ కేంద్రంలో అప్పగించాల్సిన బాధ్యత పీఓపై ఉందన్నారు. పోలింగ్ జరిగే సమయంలో అనుకోని సంఘటనలు ఏమైనా జరిగితే ఆ విషయం వెంటనే సంబంధిత సెక్టోరల్ అధికారికి, ఏఆర్ఓకు, రిటర్నింగ్ అధికారికి తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో ఆర్వోలు నూరుల్ ఖమర్, భరత్ నాయక్, సి.హెచ్ రంగయ్య, లక్ష్మణ మూర్తి, రామ్మోహన్, సుదర్శన్ దొర, అప్పారావు పాల్గొన్నారు.

ఆపదవేళ అదృశ్యం

ఓట్ల కోసం విన్యాసం




- కరోనావేళ ఆదుకోని టీడీపీ నేతలు
- కోవిడ్ సమయంలో ఫోన్‌లు సైతం ఎత్తని పరిస్థితి
- విశాఖలో అచ్చెన్న.. ఢిల్లీలో ఎంపీ రామ్మోహన్
- మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొన్న వైఎస్ జగన్ ప్రభుత్వం
- కష్టకాలంలో రూ.707.61కోట్లతో ప్రత్యేక ఆర్థిక సాయం



కరోనా సమయంలో టెక్కలిలో నిరుపేదలకు సరుకులు అందజేస్తున్న ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ

అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా నాయకులు జనం కోసం పనిచేయాలి. నమ్ముకున్న వారి క్షేమం కోసం పాటు పడాలి. కానీ టీడీపీ నేతలు ఆపత్కాలంలో ఆప్తులను వదిలేశారు. కోవిడ్ మహమ్మారి ఊళ్లకు ఊళ్లను వణికిస్తుంటే.. తమ దారి తాము చూసుకున్నారు. విశాఖలో ఒకరు, ఢిల్లీలో ఇంకొకరు, జనాలకు దూరంగా చాలామంది దాక్కున్నారు. ఓ వైపు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముమ్మరంగా సాయం చేస్తూ జనాలకు ధైర్యమిస్తూ ఉంటే.. టీడీపీ నాయకులు మాత్రం కనీసం తమ కార్యకర్తల కోసమైనా పనిచేయలేదు. మరోవైపు వైఎస్సార్‌సీపీ నాయకులు నిరంతరం జనాల్లోనే ఉంటూ వారి బాగోగులు చూసుకున్నారు.



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: అధికారంలో ఉన్నంతకాలం ఇసుక, నీరుచెట్టు, ప్రాజెక్టులు, మద్యం, అభివృద్ధి పనుల ముసుగులో కోట్లు వెనకేసుకున్న టీడీపీ నాయకులు జనాలకు ఓ కష్టం వచ్చిన వేళ అండగా నిలవలేకపోయారు. కనీసం సొంత పార్టీ క్యాడర్‌ను కూడా కరోనా కాలంలో వారు పట్టించుకున్న పాపాన పోలేదు. కరోనా కష్టకాలంలో టీడీపీ నేతలు జాడే కానరాలేదు. కనీసం ఫోన్‌లు కూడా ఎత్తడం లేదు.

జిల్లాను కరోనా సెకెండ్ వేవ్ ఎంతగా కబళించిందో జిల్లా ప్రజలందరికీ తెలిసిందే. యువత సైతం మహమ్మారి బారిన పడి చనిపోయారు. ఇంత కష్టకాలంలో టీడీపీ నాయకులు ఎక్కడ ఉన్నారో ఎవరికీ తెలీని పరిస్థితి ఉండేది. ఒక్కో నేత ఒక్కో చోట దాక్కుని ఉన్నారు. ఆపద వచ్చినప్పుడు తమ నాయకుడు ఆదుకుంటారని సాధారణంగా నియోజకవర్గ ప్రజలు, కేడర్ అనుకుంటారు. తమ నాయకుడు ఏదో ఒక ఆస్పత్రికి చెప్పి, బాగా చూడాలని, మెరుగైన వైద్యం అందించాలంటూ చెబుతారని ఆశిస్తారు. కానీ జిల్లాలో పరిస్థితి అందుకు భిన్నం. టీడీపీ నేతలు ఎక్కడా ఆ రకంగా స్పందించిన దాఖలాల్లేవు. ఏ ఒక్క నేత కూడా కనీసం పట్టించుకోలేదు.

దాక్కున్న టీడీపీ నేతలు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు స్థానికంగా లేరు. కరోనా సమయంలో విశాఖలో తలదాచుకున్నారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఎక్కడున్నారో నాయకులకు కూడా తెలియని పరిస్థితి. నాయకులు ఎవరు ఫోన్ చేసినా కనీసం లిఫ్ట్ చేయలేదు. సోషల్ మీడియాలో మాత్రం హడావుడి చేశారు. తానొక కంట్రోల్ రూమ్ ప్రారంభించినట్టు బిల్డప్ ఇచ్చారు. ఆయనేదో వ్యక్తిగతంగా సాయమందిస్తారేమో అనుకుని చాలా మంది ఫోన్లు చేశారు. కానీ ఆయన చేసిందేమీ లేదు. ఇద్దరు వ్యక్తులతో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు వచ్చిన విన్నపాలను అధికారులకు మళ్లించారు. అప్పటికే అధికారులు కంట్రోల్ రూమ్ నడుపుతున్నారు. వారికి నేరుగా వచ్చే ఫోన్‌లకు స్పందిస్తున్నారు. ఈయన వల్ల మరింత జాప్యం జరిగే పరిస్థితి ఏర్పడింది. కోవిడ్ రోగులకు బెడ్‌లు ఎక్కడున్నాయని అడిగితే అధికారులను అడిగి చెబుతామంటూ దాట వేస్తూ చేతులు దులుపుకున్నారు.

మాజీ మంత్రి కళా వెంకటరావు ఎక్కడున్నారో తెలియనట్టుగా ఇంటికి తాళాలు వేసుకుని లోపలే ఉన్నారు. కనీసం కేడర్ ఫోన్ ఎత్త లేదని ఆ పార్టీ కార్యకర్తలే వాపోయారు. జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ పరిస్థితి దాదాపు ఇంతే.



గ్రామ వలంటీర్లకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం (ఫైల్)

ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, పలాస మాజీ ఎమ్మెల్యే గౌతు శ్యామ్ సుందర్ శివాజీ, గౌతు శిరీష, మాజీ ఎమ్మెల్యేలు కోండ్రు మురళీమోహన్, కావలి ప్రతిభా భారతి తదితరులు కరోనా కాలంలో జనాలకు కనిపించనే లేదు.

అందుబాటులో వైఎస్సార్‌సీపీ నేతలు..

కష్టకాలంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులోనే ఉన్నారు. కొందరు నేరుగా ప్రజల వద్దకు వెళ్లగా, మరికొందరు తన పీఏ నంబర్లను ప్రజల వద్ద ఉంచి, ఏ సమస్య వచ్చినా తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ విధంగా నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు సేవలు పొందారు. తమకు అవకాశం ఉన్న మేరకు స్పందించారు. ఆస్పత్రిలో బెడ్ కావాలన్నా, రోగులకు మెరుగైన వైద్యం కోసం, మందులు, ఇతరత్రా అవసరాల కోసం ఎప్పటికప్పుడు స్పందించారు.

- తమ్మినేని సీతారాం ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్నారు. ఫోన్‌లో కూడా అందుబాటులో ఉన్నారు.
- డిప్యూటీ సీఎం హోదాలో ధర్మాన కృష్ణదాస్ కూడా అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు చేయడమే కాకుండా కోవిడ్ ఆస్పత్రులను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గ ప్రజలకు ఏ అవసరం ఉన్నా స్పందించారు.
- మంత్రి సీదిరి అప్పలరాజు కూడా అదే రకంగా స్పందించారు. కోవిడ్ ఆస్పత్రుల ఏర్పాటు, సేవలందించడంలో తనదైన పాత్ర పోషించారు.
- ఎమ్మెల్యే రెడ్డి శాంతి అయితే నిరంతరం నియోజకవర్గ ప్రజల మధ్యనే ఉన్నారు. మహిళా ఎమ్మెల్యే అయినప్పటికీ ధైర్యంగా ప్రజలకు అందుబాటులోనే ఉండి సాయపడ్డారు.
- శ్రీకాకుళంలో ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు, టెక్కలిలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కూడా ప్రజలకు ఏ అవసరం వచ్చినా వెంటనే స్పందించి సాయం చేయడంలో తమదైన పాత్ర పోషించారు.
- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కరోనా బారిన పడినప్పటికీ తన అనుచరుల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్నారు.
- ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అయితే కరోనా కష్టకాలంలో రిస్క్ తీసుకుని పనిచేశారు. జిల్లా యంత్రాంగానికి రెండు ఆక్సిజన్ అంబులెన్స్‌లు అందించారు.



రూ.707.61కోట్లు ప్రభుత్వ సాయం

కరోనా సమయంలో నిత్యావసర సరుకులకు బయటకు వెళ్లలేని పరిస్థితిలో వైఎస్సార్‌సీపీ నాయకులు వ్యక్తిగతంగా తమ సొంత సొమ్ముతో కొనుగోలు చేసి ప్రజలకు సరఫరా చేశారు. ఎక్కడికక్కడ పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. కొన్ని నియోజకవర్గాల్లో ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ప్రత్యేకంగా వలంటీర్లను పెట్టుకుని తోచినంత సాయం చేశారు. ఇక ప్రభుత్వం ప్రతీ ఇంటికి సాయం చేసింది. ఒకవైపు కోవిడ్ ఆస్పత్రులను ఏర్పాటు చేయడమే కాకుండా ఆక్సిజన్ సిలిండర్లతో పాటు ఆక్సిజన్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. రోగులకు పౌష్టికాహారం అందజేసింది. హోం ఐసోలేషన్‌లో ఉన్న రోగులకు ఇంటింటికీ ఉచితంగా మందులు పంపిణీ చేసింది. ముందస్తు జాగ్రత్తగా ప్రతి ఇంటికి మెడికల్ కిట్ అందజేసింది. అంతటితో ఆగకుండా ప్రతి ఇంటికి ఆర్థిక సాయం చేసింది. జిల్లాలో 6,70,438 మందికి రూ.707.61కోట్లు మేర సచివాలయంలోనే వలంటీర్ల ద్వారా పంపిణీ చేసింది. అంతేకాకుండా విదేశాల్లోనూ, ఇతర రాష్ట్రాల్లో, ఇతర జిల్లాల్లోనూ చిక్కుకున్న వారిని ప్రత్యేక బస్సులు, ట్రైన్‌లు, విమానాలు ఏర్పాటు చేసి స్వగ్రామాలకు క్షేమంగా తీసుకొచ్చింది. ముఖ్యంగా జిల్లాలోని వలస కూలీలు, వలస మత్స్యకారులను ప్రత్యేక జాగ్రత్తలతో తీసుకొచ్చి, ప్రత్యేక క్వారంటైన్ ఏర్పాటు చేసి, ఏ ఒక్కరికీ ప్రాణాపాయం లేకుండా చర్యలు తీసుకుంది.

ఆశా కార్యకర్తలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ధర్మాన కృష్ణదాస్ (ఫైల్)





పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాలు అందజేస్తున్న ప్రస్తుత ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్(ఫైల్)

కరోనా సమయంలో ప్రభుత్వం అందించిన సాయం

నియోజకవర్గం	ఆమదాలవలస	నరసన్నపేట	శ్రీకాకుళం	టెక్కలి	పలాస	ఇచ్ఛాపురం	ఎచ్చెర్ల	పాతపట్నం
లబ్ధిదారులు	71,447	80,241	86,474	85,875	75,696	90,425	96,258	84,022
సాయం (రూ.లక్షల్లో..)	6936.42	8202.95	9072.66	8952.80	8235.07	10443.39	9938.78	8979.11

టీడీపీ నాయకులు పత్తా లేరు



ప్రపంచాన్ని వణికించిన కరోనా సమయంలో టీడీపీ నేతలు పత్తా లేకుండా పోయారు. ఎక్కడా కూడా వారి జాడ ఆ సమయంలో కనిపించలేదు. వైఎస్సార్ సీపీ నాయకులే జనాలను పట్టించుకొన్నారు. ఆ పరిస్థితుల్లో సేవా కార్యక్రమాలు చేశారు. ప్రజలు ఇప్పటికీ ఆనాటి భయానక పరిస్థితులు, సాయం చేసిన వైనాన్ని జనం మర్చిపోలేరు.

– మెండ ప్రకాశరావు,
కేసరపద గ్రామం, కంచిలి మండలం

ఆదుకున్నది వైఎస్సార్‌సీపీ నాయకులే



కరోనా మహమ్మారి బారిన పడి నానా ఇక్కట్లు పడ్డాను. ఆ సమయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఫోన్‌లలో సంప్రదించారు. పార్టీ కార్యకర్తలు, వలంటీర్లు ఇంటికి వచ్చి ఆప్యాయంగా పలకరించి మందులు ఇప్పించారు. దీంతోపాటు చాలామందికి ఇంటికి కూడా కూరలు, పండ్లు, బియ్యం, తదితర వస్తువులు అందజేశారు. టీడీపీ నాయకులు గానీ, కార్యకర్తలు గానీ ఎక్కడా కానరాలేదు.

– గుర్లఖ మహేష్,
ఐజీ నాయుడు కాలనీ, ఆమదాలవలస పట్టణం

సమన్వయంతో పనిచేద్దాం: ఎస్పీ



శ్రీకాకుళం క్రైమ్ : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని, సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ జీఆర్ రాధిక కేంద్ర బలగాల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధుల కోసం జిల్లాకు కేటాయించిన కేంద్ర సాయుధ దళాలు, జిల్లా పోలీసు అధికారులకు ఎన్నికల రోజున పాటించాల్సిన నియమ నిబంధనలు వివరించారు. అనంతరం రూట్‌మ్యాప్‌పై అవగాహన, పోలింగ్ స్టేషన్, చెక్‌పోస్టులు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద నిర్వర్తించాల్సిన విధులు తదితర అంశాల గురించి దిశానిర్దేశం చేశారు. అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'12, 13 తేదీల్లో పత్రికా ప్రకటనలపై ముందస్తు అనుమతి తప్పనిసరి'



శ్రీకాకుళం పాతబస్టాండ్: పోలింగ్, ప్రీ పోలింగ్ (ఈనెల 12, 13 తేదీల్లో) రోజుల్లో వివిధ దినపత్రికల్లో ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు జారీచేసే ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఇందుకు గాను కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎం.సి.ఎం.సి)కి ప్రకటన జారీ చేసే తేదీకి కనీసం రెండు రోజులు ముందుగా దరఖాస్తు చేసి ముందస్తు ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. ఈ విషయాన్ని అన్ని పత్రికల యాజమాన్యాలు, ఆయా రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు గుర్తించాలని, ఎం.సి.ఎం.సి. ధ్రువీకరణ, ముందస్తు అనుమతి లేకుండా పత్రికల్లో ఆయా రాజకీయ పార్టీలు లేదా అభ్యర్థుల ప్రకటనలు ప్రచురించరాదని సూచించారు. అభ్యర్థుల వద్ద రాత పూర్వక అనుమతి తీసుకోకుండా ఇతరులెవరూ రాజకీయ ప్రకటనలు జారీ చేయరాదని చెప్పారు. అలాగే ఎలక్ట్రానిక్ మీడియాలో పై రెండు రోజుల్లో ఎలాంటి రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయరాదని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో హైకోర్టు జడ్జి జస్టిస్ రవీంద్రబాబు



న్యాయమూర్తికి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.రవీంద్రబాబు కుటుంబసమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టత వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోటోకాల్ సిబ్బంది, వన్‌టౌన్ ఎస్సై బలివాడ గణేష్ పాల్గొన్నారు.

జూలై 10 నుంచి అరసవల్లిలో ద్విశతావధానం



మాట్లాడుతున్న ఇప్పిలి శంకరశర్మ

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం, శ్రీసుమిత్ర కళా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఏడాది జూలై 10 నుంచి 14 వరకు అరసవల్లిలో తొలిసారిగా ద్విశతావధానం నిర్వహిస్తున్నామని ప్రధానార్చకులు, శ్రీసుమిత్ర కళాసమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీసుమిత్ర కళాసమితి ద్వారా ఇప్పటివరకు 9 శతావధానాలను నిర్వహించామని చెప్పారు. జూలైలో వరుసగా ఐదు రోజుల పాటు ప్రముఖ మహిళా శతావధాని డాక్టర్ బులుసు అపర్ణచే శతావధానం పేర్కొన్నారు. పృచ్ఛకులుగా పాల్గొనేందుకు ఆసక్తి గల పండితులు, సాహితీవేత్తలు తమ పేర్లను పులఖండం శ్రీనివాసరావు (9949688625), బంకుపల్లె రమేష్ శర్మ (9441072502, 9963636785) నంబర్లకు ఫోన్ ద్వారా ముందుగా నమోదు చేయించుకోవాలని సూచించారు.

సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా రామచంద్రరావు



నియామక పత్రం అందుకుంటున్న రామచంద్రరావు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా సూర రామచంద్రరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళంలోని పెద్దమందిరంలో కన్వీనర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూర్వపు జిల్లా అధ్యక్షుడు గంగుల రమణబాబు కేంద్రం నుంచి వచ్చిన నియామక పత్రాన్ని రామచంద్రరావుకు అందజేశారు. ఈ సందర్భంగా పలు సమితుల సభ్యులు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో హయాతినగరం మందిరం సభ్యులు కిల్లా ఫల్గుణరావు, అనాద గుప్త, పి.నాగేశ్వరరావు, బోయిన నరసింహమూర్తి, సోమశేఖర్, కృష్ణారావు, కె.భాస్కరరావు, లోకనాథం రామారావు పాల్గొన్నారు.

పార్సిల్ కౌంటర్లలో సెబ్ జేడీ తనిఖీలు



తనిఖీలు చేస్తున్న సెబ్ జేడీ గంగాధరం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని పలు ట్రావెల్స్, పార్సిల్ సెంటర్లను శ్రీకాకుళం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ, జాయింట్ డైరెక్టర్ డి.గంగాధరం గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపర్చేందుకు రాజకీయ పార్టీలు అక్రమ దారుల్లో మద్యం, నగదు, సారాయి, గంజాయి వంటివి పంపిణీ చేయకుండా సోదాలు చేశారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సులోని పార్సిల్ సెంటర్‌తో పాటు ట్రావెల్స్ కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించారు.

పారా ఒలింపిక్ బీచ్ వాలీబాల్ జట్టుకు రమణ ఎంపిక



ఎం.వెంకటరమణ

శ్రీకాకుళం న్యూకాలనీ: చైనా వేదికగా ఈనెల 28 నుంచి జూన్ 5 వరకు జరిగే పారాబీచ్ వాలీబాల్ ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే భారత జట్టుకు జిల్లాకు చెందిన మైలపల్లి వెంకటరమణ ఎంపికయ్యాడు. ఈ మేరకు పారా ఒలింపిక్ వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తుది జట్టును ప్రకటించింది. వెంకటరమణ స్వస్థలం రణస్థలం మండలం కొవ్వాడ. తల్లిదండ్రులు మైలపల్లి కృష్ణ, లక్ష్మి మత్స్యకారులు. వెంకటరమణ డిగ్రీ చదువుతున్నాడు. పోలియో బారిన పడినప్పటికీ తనకు ఇష్టమైన క్రీడల్లో రాణిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.



కోటబొమ్మాళి: పార్టీలో చేరిన టీడీపీ యూత్ సభ్యులతో ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్



రణస్థలం: వైఎస్సార్‌సీపీలో చేరిన అక్కయ్యపాలెం టీడీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే కిరణ్

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



పాతపట్నం: కొరసవాడ గ్రామస్తులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

రణస్థలం: సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో భారీగా టీడీపీ శ్రేణులు చేరుతున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండలం మెంటాడ పంచాయతీ అక్కయ్యపాలెంలో 11 టీడీపీ కుటుంబాలు, రణస్థలం పంచాయతీ పిట్టపాలెంలో 50 టీడీపీ కుటుంబాలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో గుండు జగ్గారావు, రైతు సూర్యనారాయణ, పెసల సూర్యారావు, గండమాని పోతయ్య, గంగులు, సూరప్పడు, పిట్ట కృష్ణ, మల్లేష్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ రెడ్డి, లంకలపల్లి రామారావు, పిన్నింటి లక్ష్మునాయుడు, కరిమజ్జి భాస్కరరావు, మజ్జి రమేష్, మహంతి జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

➺ కోటబొమ్మాళి: మండలంలోని చీపుర్లపాడు పంచాయతీ వరహాలమ్మపేట, ఊడికిలపాడు గ్రామాలకు చెందిన తెలుగుదేశంపార్టీ యూత్ సభ్యులు జోగి లక్ష్మీనారాయణ, సదునుపల్లి శివ, చెన్నంశెట్టి రాంబాబు, తోట లక్ష్మణరావుపాటు మరో 10 కుటుంబాలు టెక్కలి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ నేతింటి అప్పలస్వామి, ఎంపీటీసీ బొడ్డు అప్పన్న, మండల పార్టీ కన్వీనర్ నూక సత్యరాజు, నాయకులు దుబ్బ వెంకటరమణారావు, అన్నెపు రామారావు, రోణంకి మల్లయ్య, ఎస్.హేమసుందరరాజు, పేడాడ వెంకటరావు, చింతాడ అనిరుద్రుడు, మెట్ట సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

➺ పాతపట్నం: మండలంలోని కొరసవాడకు చెందిన 60 టీడీపీ కుటుంబాలు ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో వంజరాపు అప్పయ్య, దాము ఎరకన్న, దాబు శ్రీనివాస్, వంజరాపు మురళీ యాధవ్, రాజాన అప్పారావు, జయజల భారికి, జక్కర నవీన్, వంజరాపు శ్రీను, బొడ్డు మోహన్ యాదవ్, పైసెక్కి బాల, సిమ్మయ్య, బతకల శ్రీరారం చిరంజీవులు, ఈగల అప్పయ్య, ఈగ సిమాలు ఉన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరరావు, వీవర్స్ జిల్లా అధ్యక్షుడు మంచు చంద్రయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం.తాతయ్య, తీరు, బొంగు శ్రీరాములు, మద్ది నారాయణరెడ్డి, సర్పంచ్ జక్కర ఉమా పాల్గొన్నారు.

➺ పాతపట్నం: మండలంలోని బూరగాం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ వేణుమాధవ్ పుల్లాయ్, టీడీపీ బూత్ ఏజెంట్ నర్సింగ పుల్లాయ్, రఘు ఆప్టో, కృష్ణ సాహు, భాస్కర్ పుల్లాయ్‌తో పాటు 200 కుటుంబాల వారు టీడీపీ ని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రెడ్డి శాంతి తనయుడు రెడ్డి శ్రావణ్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరరావు సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.ప్రదీప్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.అప్పన్న, నాయకులు ప్రహ్లాద పుల్లాయ్, మురళీ అప్టో, పడాల గోపి పాల్గొన్నారు.



పాతపట్నం: బూరగాం గ్రామస్తులకు వైఎస్సార్ సీపీ కండువాలు వేస్తున్న రెడ్డి శ్రావణ్, శ్యామ్‌సుందరరావు



రణస్థలం: వైఎస్సార్‌సీపీలో చేరిన పిట్టపాలెం టీడీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

బీసీల ఆశాజ్యోతి సీఎం జగన్



- కాళింగ సామాజికవర్గానికి ప్రాధాన్యమిచ్చింది వైఎస్సార్‌సీపీయే
- 'సాక్షి'తో కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల రామారావు

ఇంటర్వ్యూ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బీసీల కోసం నిరంతరం పరితపించే నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల రామారావు (లక్ష్మణరావు) మాస్టారు అన్నారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ కాదు బ్యాక్‌బోన్ అని నిరూపించింది జగనన్నేనని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలన్నీ బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకున్నాయే తప్ప ఆయా కులాల అభివృద్ధికి కృషి చేసిన నాయకుడు ఒక్క జగన్ మాత్రమేనని చెప్పారు. ఆలిండియా బీసీ ఫెడరేషన్‌లో సుదీర్ఘకాలంపాటు పనిచేసి బీసీల సమస్యలపై పోరాటాలు చేసిన కళింగ కార్పొరేషన్ చైర్మన్ రామారావుతో 'సాక్షి'తో గురువారం ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

➺ రాష్ట్రంలో వెనుకబడిన కులాల అభివృద్ధికి ఆలోచన చేసి 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి చైర్మన్లను నియమించిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీయే.

➺ బీసీలు, ఎంబీసీలు, వెనుకబడిన కులాలన్నీ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారు. జయహో బీసీ అంటూ చంద్రబాబు మరోమారు మోసగించేందుకు సభలు, సమావేశాలు పెట్టి అబద్ధాలు చెప్పి ఓట్లు దండుకునేందుకు ప్రయత్నం చేస్తున్నా నమ్మే స్థితిలో జనాలు లేరు.

➺ దేశవ్యాప్తంగా బీసీ సీఎంలుగా ఉన్న రాష్ట్రాల్లో సైతం బీసీల స్థితిగతులు, జీవన ప్రమాణాలు మారని పరిస్థితి ఉంది. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం సీఎం జగన్ బీసీలకోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్ పదవుల్ని అప్పగించి వెనుకబడిన కులాల అభివృద్ధికి కృషి చేశారు.

➺ ఎటువంటి మధ్యవర్తులు లేకుండా, అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల ఖాతాల్లో డీబీటీ పద్ధతిలో రూ 1.32 లక్షల కోట్లు డబ్బులు జమచేసి ఆదుకున్నారు.

➺ వెనుకబడిన వర్గాల అభివృద్ధి విద్య, వైద్యంతోనే సాధ్యమని గుర్తించి అత్యధికంగా నిధులు కేటాయించి సామాజిక స్థితిగతులు మార్చేందుకు సీఎం జగనన్న ప్రయత్నం చేస్తున్నారు.

➺ జిల్లాలో కాళింగ సామాజికవర్గానికి రాష్ట్ర చరిత్రలో ఎన్నడు లేనివిధంగా స్పీకర్ స్థానం, మూడు ఎమ్మెల్యే సీట్లు, ఎంపీ స్థానం, జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్సీ పదవి కల్పించారు. నామినేటెడ్ పదవుల్లో సైతం అధిక ప్రాధాన్యమిచ్చారు.

➺ దివంగత బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించి కాళింగ సామాజివర్గంలో ఉత్తేజాన్ని నింపిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది.

➺ రాజకీయకంగా, ఆర్థికంగా తమ కులాన్ని బలోపేతం చేసింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగనన్నను గెలిపించేందుకు కాళింగ కులస్తులంతా సిద్ధంగా ఉన్నారు.

జగనన్నకు కృతజ్ఞత చూపించాల్సిన సమయమిదే

- ఏపీ శిష్ట కరణ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్



మాట్లాడుతున్న శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్

అరసవల్లి: జిల్లాలో శిష్ట కరణాలంతా ఈ నెల 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని అసెంబ్లీ, ఎంపీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని రాష్ట్ర శిష్టకరణ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కంటిమహంతి అనూష పట్నాయక్ పిలుపునిచ్చారు. గురువారం అరసవల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ శిష్టకరణాలను దివంగత వైఎస్సార్ హయాంలో బిసిల్లో చేర్చితే.. ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మనకు ప్రత్యేకంగా సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి జీవన ప్రమాణాలను పెంచి మరింత గుర్తింపునిచ్చారని చెప్పారు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితేనే మనతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా బడుగు, బలహీన, వెనుకబడిన కులాల వారికి నేరుగా సంక్షేమం అందుతుందన్నారు. మనమంతా జగన్‌కు కృతజ్ఞత చూపించాల్సిన సమయం ఇదేనని..వైఎస్సార్ అభ్యర్థులను గెలిపిద్దామని పిలుపునిచ్చారు. కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో శిష్ట కరణాలంతా వైఎస్ జగన్‌కు రుణపడి ఉన్నామని, ఇప్పుడు ఆ రుణాన్ని తీర్చుకోవాలన్నారు. మనవాళ్లలో ఏ పార్టీ సానుభూతి పరులైనప్పటికీ..ఈ ఎన్నికల్లో 'ఫ్యాన్' గుర్తుకే ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులందరినీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు సదాశివుని కృష్ణ, ఉరిటి అప్పారావు, వి.అరుణకుమారి, ఆలిండియా శిష్టకరణ అధ్యక్షుడు కె.బెనర్జీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివం జ్యోతి పట్నాయక్, ఎస్.ఎం.కె.మహంతి, శ్రీకాకుళం వైఎస్సార్ సోషల్‌మీడియా కోఆర్డినేటర్ సురేంద్ర పట్నాయక్, దుగ్గివలస శ్రీనివాసరావు, చంద్రమోహన్, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అరసవల్లి సూర్యనారాయణ స్వామిని శిష్టకరణ సంఘ ప్రతినిధులు దర్శించుకున్నారు. సీఎం మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షిస్తూ పూజలు చేయించారు.

బ్రాహ్మణుల ద్రోహి చంద్రబాబు

- దేవదాయశాఖ రాష్ట్ర సలహాదారు జ్వాలాపురపు శ్రీకాంత్



మాట్లాడుతున్న దేవదాయశాఖ రాష్ట్ర సలహాదారు జ్వాలాపురపు శ్రీకాంత్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సంపన్న వర్గాలకు, డబ్బు ఉన్న సామాజికవర్గాలతో చంద్రబాబునాయుడు సన్నిహితంగా ఉన్నారే తప్ప బ్రాహ్మణుల సంక్షేమాన్ని ఏనాడూ పట్టించుకోలేదని రాష్ట్ర దేవదాయశాఖ సలహాదారుడు జ్వాలాపురపు శ్రీకాంత్ ధ్వజమెత్తారు. బ్రాహ్మణులంతా వైఎస్సార్‌సీపీకి మద్దతిచ్చేందుకు చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమావేశాల్లో భాగంగా శ్రీకాకుళం నగరంలో వైఎస్సార్‌సీపీ టౌన్ హాల్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ బ్రాహ్మణులను అభివృద్ధి చెందకుండా చేసిన పాపం చంద్రబాబుదేనన్నారు. సీఎం జగనమోహన్ రెడ్డి బ్రాహ్మణులకు, పురోహితుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేశారని గుర్తు చేశారు. గ్రామ కరణాలుగా చాలీచాలని వేతనాలతో జీవనం సాగించిన బ్రాహ్మణులను ఆర్థికంగా దెబ్బతీసేందుకు కరణాల వ్యవస్థను రద్దుచేసిన పార్టీ టీడీపీ అని మండిపడ్డారు. బ్రాహ్మణుల అభ్యున్నతికి దివంగత మహానేత వైఎస్సార్, ఆయన మరణాంతరం సీఎం జగన్ పాటుపడ్డారని పేర్కొన్నారు. వంశపారపర్యంగా అర్చక విధులు నిర్వహిస్తున్న బ్రాహ్మణులకు చేయూతనందించారని గుర్తు చేశారు. ధూప దీపనైవేద్యాలు లేని ఆలయాలకు సైతం సాయమందించారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని తీసుకొద్దామని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో శ్రీకాకుళం జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గుమ్మా నగేష్, ఏపీ పురోహిత బ్రాహ్మణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తెన్నేటి సునీల్ శర్మ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు టి.కామేశ్వరీ, బలివాడ రాజేష్, జిల్లా బ్రాహ్మణ సంఘం కోశాధికారి వి.వి.ఎస్.ప్రకాష్, జిల్లా బ్రాహ్మణ సంఘం ప్రతినిధి యామిజాల గాయత్రి, దూసి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలోనే.. తూర్పుకాపులకు గుర్తింపు

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యమంటున్న సామాజికవర్గ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): హలం పట్టి పొలం దున్ని పట్టెడన్నం పెట్టిన వ్యక్తుల్లో అత్యధికం తూర్పుకాపులే. ఆ జాతిని గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగా వాడుకున్నాయే తప్ప ఆదుకున్న దాఖలాలు లేవు. వారిని అన్ని విధాలా ఆదుకుని అండగా నిలిచింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. జిల్లాలో అత్యధికంగా ఉన్న తూర్పుకాపులే వలసజీవులుగా కూడా ఉండేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలసల నివారణకు పండించిన పంటలకు గిట్టుబాటుధర వచ్చేలా చర్యలు చేపట్టారు. రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటుచేసి రైతన్న వద్దకే విత్తనాలు, ఎరువులు అందించి వ్యవసాయం వైపు మళ్లించి వలసలు నివారించారు. జిల్లాకు చెందిన మామిడి శ్రీకాంత్‌కు తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ పదవిని అందించి కాపులకు పెద్దపీట వేశారు. తూర్పుకాపుల సంక్షేమ భవనానికి జిల్లా కేంద్రంలో 50 సెంట్ల స్థలం ఇచ్చి ప్రాధాన్యమిచ్చారు. ఎచ్చెర్లలో గొర్లె కిరణ్‌కుమార్, పాతపట్నంలో రెడ్డి శాంతికి ఎమ్మెల్యే సీట్లు ఇచ్చారు. గతంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్ష పదవి సైతం రెడ్డి శాంతికి కల్పించారు. డీసీసీబీ చైర్మన్‌గా కరిమి రాజేశ్వరరావును నియమించారు. అనేకమందికి జెడ్పీటీసీలు, ఎంపిటీసీలు, ఎంపీపీలుగా అవకాశం కల్పించారు. టీడీపీ హయాంలో మాత్రం ఎటువంటి నామినేటెడ్ పదవులు ఇవ్వకుండా తూర్పుకాపు ఓట్లతో అధికారం చేజిక్కించుకుని తర్వాత పట్టించుకోవడం మానేశారు. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపులో తూర్పుకాపులు కీలకపాత్ర పోషించనున్నారు. ముఖ్యంగా ఎంపీ అభ్యర్థిగా ఉన్న పేరాడ తిలక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కంకణం కట్టుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తూర్పుకాపులంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించి రుణం తీర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారు.


గెలిపిస్తాం..



స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా తూర్పుకాపులను పట్టించుకున్న వారే లేరు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో చెప్పినట్లుగా 56 వెనుకబడిన కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటుచేస్తామని చెప్పి మాట నిలబెట్టుకున్నారు. జీవితాంతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటాం. వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం జిల్లాలో తూర్పుకాపులంతా కష్టపడి పనిచేస్తున్నారు. ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌తో పాటు 8 ఎమ్మెల్యే స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులనే గెలిపిస్తాం.

– మామిడి శ్రీకాంత్, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్, శ్రీకాకుళం

జగనన్నే గుర్తించారు..



తూర్పుకాపులకు ఆదుకున్నది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. జిల్లా, మండల, గ్రామస్థాయిలో కాపులకు గుర్తింపు వచ్చిందంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్లే. సంక్షేమ ఫలాలు అందించి తూర్పుకాపుల బతుకుల్లో వెలుగులు నింపారు.

– ఖండాపు గోవిందరావు, బూర్జ మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు

మా లక్ష్యం అదే



ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయకంగా వెనుకబడిన తూర్పుకాపులకు ప్రాధాన్యమిచ్చింది సీఎం జగన్‌మోహన్ రెడ్డి. వెనుకబడిన సామాజిక వర్గాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న పార్టీ వైఎస్సార్ సీపీ. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో తూర్పుకాపులంతా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపుకోసం కృషిచేస్తున్నాం. ఎంపీగా తిలక్‌ను గెలిపించి తీరుతాం.

– కరిమి రాజేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్, శ్రీకాకుళం జిల్లా

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం తగదు



ఆగూరి ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం పాత బస్టాండ్: ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో రానున్న రోజుల్లో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కలుగుతుందని, భూ వివాదాలు తగ్గుతాయని సీనియర్ న్యాయవాది, బీసీ అడ్వకేట్స్ జిల్లా అధ్యక్షుడు ఆగూరి ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్ని రాజకీయ పార్టీలు, కొంతమంది వ్యక్తులు సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ఈ చట్టంపై అవాస్తవాలను ప్రచారం చేస్తుండటాన్ని ఖండించారు. ఈ చట్టంపై దుష్ప్రచారం చేస్తూ ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించడం తగదన్నారు. ఈ చట్టం ఇంకా అమల్లోకి రాలేదని తెలిపారు. దీనిని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, అన్ని రాష్ట్రాల్లోనూ టైటిలింగ్ యాక్ట్ ఉండాలని ఆదేశించిందని, ఆ మేరకే ఏపీ ప్రభుత్వం ఈ చట్టానికి రూపకల్పన చేసిందని పేర్కొన్నారు. అయితే ఈ చట్టంలో చిన్న మార్పుల కోసం న్యాయవాదుల సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో పునరాలోచన చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అమలు ఆగిందని ఆయన వివరించారు.

దువ్వాడకు శిష్టకరణాల మద్దతు



టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌తో కలిసి ప్రచారం చేస్తున్న శిష్టకరణం సంఘ ప్రతినిధులు

టెక్కలి: వైఎస్సార్‌సీపీ టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఎన్నికల ప్రచారానికి శిష్టకరణం సామాజికవర్గ ప్రతినిధులు మద్దతు పలికారు. శిష్టకరణం కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ, ప్రతినిధులు పోలిమహంతి ఉమామహేశ్వరరావు, అంపలాం వసంత్‌కుమార్, జి.ఆర్.జి.నాయుడు తదితరులు గురువారం దువ్వాడ శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో శిష్టకరణాలకు ప్రత్యేక గుర్తింపునిచ్చారని, ఆ తరువాత ఆయన తనయుడు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ప్రత్యేక కార్పొరేషన్ల ఏర్పాటుతో పాటు సంక్షేమానికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు.

స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్ల పరిశీలన



రిసెప్షన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజీలో ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రి డిపాజిట్ చేసే కేంద్రాలు, స్ట్రాంగ్ రూంలు, రిసెప్షన్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలను ఎన్నికలు పరిశీలకులు శేఖర్ విద్యార్థి, దిగంబర్ ప్రధాన్‌లు గురువారం పరిశీలించారు. ఏర్పాట్లపై కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్పీ రాధిక, ఇతర అధికారులతో చర్చించారు. సజావుగా ఎన్నికల ప్రక్రియ జరగాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తమీమ్ అన్సారియా, జేసీ ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ రివార్డు పాయింట్ల పేరిట మోసం

కంచిలి: ఎస్‌బీఐ రివార్డు పాయింట్లు వచ్చాయంటూ లింక్స్ పంపి ఆన్‌లైన్ మోసగాళ్లు అమాయక ప్రజల్ని దోచుకుంటున్నారు. తాజాగా కంచిలికి చెందిన పెప్సీ ఏజెంట్ కొత్తకోట విజయబాబు అనే వ్యాపారి ఈ తరహా మోసానికి బలయ్యారు. విజయబాబుకు ఎస్‌బీఐ రివార్డు పాయింట్స్ వచ్చాయని ఓ వాట్సాప్ గ్రూపులో మెసేజ్ వచ్చింది. దానిని ఓపెన్ చేసి అవతలి వ్యక్తికి వివరాలు చెప్పారు. అంతే నిమిషాల వ్యవధిలోనే బాధితుని వ్యాపార సంస్థకు చెందిన పి.ఎ.బి.ఎల్. ఓ.డి. అకౌంట్ నుంచి డబ్బుల్ని కాజేశారు. ఇటీవలే ఆ అకౌంట్‌కు రూ.11,80,000 రుణాన్ని బ్యాంకు వారు మంజూరు చేశారు. దానిని గుర్తించిన ఆగంతకులు విజయబాబుకు చెందిన ఎస్‌బీఐ యోనో యాప్‌ను అతడి మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయించి అందులోంచి రూ.25వేలు చొప్పన నాలుగుసార్లు, ఫ్లిప్‌కార్ట్‌లో కొనుగోలు చేసేందుకు రూ.2,76,178, మరోసారి రూ.1,10,098 విత్‌డ్రా చేశారు. ఈ మేరకు మెసేజ్‌లు రావడంతో ఏం జరుగుతుందో అర్థంకాక బాధితుడు బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించి విషయం వివరించి లావాదేవీలు జరగకుండా నిలిపివేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ వి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటుహక్కు వినియోగించుకుందాం



పాటను విడుదల చేస్తున్న చౌదరి పురుషోత్తమనాయుడు

శ్రీకాకుళం అర్బన్: ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమనాయుడు అన్నారు. శ్రీకాకుళంలోని ఏపీ ఎన్జీవో కార్యాలయంలో గురువారం 'ఓటు.. విలువ తెలుసుకుందాం' అనే పాటను నగిరి కరుణాకర్ రచించగా, ఏపీ ఎన్జీవో సంఘ పలాస అధ్యక్షుడు బోనేల గోపాల్ ఆలపించారు. ఈ పాటను పురుషోత్తమనాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, సంఘ నాయకులు కంఠ జయరామ్, బొత్స శ్రీనివాసరావు, రాజ్‌కుమార్, చింతాడ రాజేష్, అజయ్ ఎర్రం నాయుడు, శ్రీరాములు, పలాస గ్రీన్ ఆర్మీ సభ్యులు నగిరి కరుణాకర్, పవన్ కందికుప్ప, సునీల్ పాల్గొన్నారు.

తూలుగులో పోలీసుల కవాతు



తూలుగు పంచాయతీలో పోలీసుల కవాతు

గార: మండలంలోని తూలుగు పంచాయతీలో గురువారం కేంద్ర రక్షణ బలగాలు, సివిల్ పోలీసులు సంయుక్తంగా పోలీసు కవాతు జరిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, ఎన్నికల విధులకు ఆటంకం కలిగించినా క్రమశిక్షణ చర్యలు తప్పవని గ్రామాల్లో జరిగిన కవాతులో ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ అన్నారు. ప్రతి ఒక్కరూ సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిపేందుకు సహకరించాలని కోరారు.

ఉవ్వెత్తున ప్రచారం

ప్రచార పర్వం

ఎన్నికల ప్రచారాలు చివరి అంకానికి చేరుకుంటున్నాయి. అభ్యర్థులు సర్వశక్తులు ఒడ్డుతూ ప్రచారాలు చేస్తున్నారు. జనాలు కూడా వారికి బ్రహ్మరథం పడుతున్నారు.



కొత్తూరు : ఎమ్మెల్యే రెడ్డి శాంతిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం



సంతబొమ్మాళి: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌కు విజయ తిలకం దిద్దుతున్న మహిళ



శ్రీకాకుళం దమ్మలవీధిలోని ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



రణస్థలం: పాతర్లపల్లిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్



కాశీబుగ్గ: మందస సెంటర్‌లో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు



ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో ప్రచార వాహనంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ



కోటబొమ్మాళి: జర్జంగి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో డ్యాన్స్ చేస్తున్న దువ్వాడ శ్రీనివాస్



పొందూరు: లోలుగులో చైతన్యరథంపై నుంచి మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

'ఎన్నికల భారతం' కవితా సంకలనం ఆవిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర శాఖ ప్రచురించిన 'ఎన్నికల భారతం' కవితా సంకలనం పుస్తకాన్ని గురువారం శ్రీకాకుళం నగరంలోని గరిమెళ్ల ప్రెస్ క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ జీవితం, రాజకీయం వేర్వేరు కాదన్నారు. ఎన్నికల పట్ల సమాజ స్పందనలను తెలియచేయడం కవులు, రచయితల బాధ్యతని పేర్కొన్నారు. అరసం రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యుడు నల్లి ధర్మారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజా న్యాయవాది, సీనియర్ ఉద్యమ నాయకులు బొడ్డేపల్లి మోహనరావు, తెరవే జిల్లా అధ్యక్షుడు ఉత్తరావిల్లి నాగేశ్వరరావు, హిందీ ప్రచార పరిషత్ ఉత్తరాంధ్ర నాయకులు కోనే శ్రీధర్, యువ కవులు కంచరాన భుజంగరావు, కలమట దాసుబాబు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు చింతాడ అప్పలనాయుడు, సామ్నా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.వి.మల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు ఎస్.నవచైతన్య, ఇస్కఫ్ జిల్లా అధ్యక్షుడు జి.వి.నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశాం: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాధారణ ఎన్నికల నిర్వహణకు సర్వ సన్నద్ధంగా ఉన్నామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఈ నెల 13 న రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో.. ఎన్నికల నిర్వహణకు 72 గంటల ముందు చేయాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు విస్తరణ ప్రణాళిక అమలు అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళం కలెక్టరేట్ హాల్ నుంచి హాజరైన జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్, జిల్లా ఎస్పీ జీఆర్ రాధికతో కలసి మాట్లాడారు. శాంతి భద్రతల నిర్వహణ, బందోబస్తు ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతి సదుపాయాలు, పోలింగ్ సిబ్బంది వివరాలు, వెబ్ కాస్టింగ్, ఎలక్ట్రోల్ రోల్, పోలింగ్ సిబ్బందికి వాహనాల ఏర్పాటు తదితర అంశాలపై తీసుకున్న చర్యలను కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.